సాక్షి
జగిత్యాల

సోమవారం । 10 । జూలై । 2023



నృసింహునికి మొక్కులు

ధర్మపురి: మంచిర్యాల ప్రిన్సిపల్ జడ్జి ప్రభాకర్‌శర్మ దంపతులు ఆదివారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు.



అమ్మవారికి పూజలు

రాయికల్ : మాల సంఘానికి చెందిన మహిళలు ఆదివారం బద్ది పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గి ఉక్కపోతగా ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

11న యువ ఉత్సవ్

జగిత్యాలటౌన్: నెహ్రూ యువకేంద్ర, భారత ప్రభుత్వ యువజన క్రీడలు, వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి నరేశ్ ఆదివారం తెలిపారు. కవిత్వం, పెయింటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, గ్రూపు సాంస్కృతిక పోటీలు ఉంటాయన్నారు. 15 – 29 ఏళ్ల వయసు గలవారు అర్హులన్నారు. మొబైల్ ఫొటోగ్రఫీలో ప్రథమ బహుమతికి రూ.1,000, ద్వితీయ బహుమతి రూ.750, తృతీయ బహుమతికింద రూ.500 నగదు అందిస్తారన్నారు. ఉపన్యాసంలో ప్రథమ రూ.5,000, ద్వితీయ రూ.2, 000, తృతీయ బహుమతిగారూ.1,000 నగదు అందిస్తారన్నారు. సాంస్కృతిక పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.2,500, తృతీయ బహుమతిగా రూ.1,250 నగదు అందజేస్తారని వివరించారు. ఆసక్తిగలవారు మంగళవారం ఉదయం 9గంటల వరకు స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో హాజరు కావాలని ఆయన కోరారు.

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. స్థానిక పటేల్ గార్డెన్‌లో ఆదివారం మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మొగిలి శేఖర్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. ధర్మపురి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో మంత్రి కొప్పుల ఈశ్వర్ రూ.కోట్లు విడుదల చేస్తున్నారని, ఈ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగిస్తాన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, నాయకులు సొల్లు భీ మయ్య, ప్రేమ్‌చందర్‌రావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు నిధులు

రాయికల్(జగిత్యాల): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సర్కారు ఇటీవల నిధులు విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరంలో రావాల్సిన మొత్తం నిధుల్లోంచి తొలివిడతగా 50 శాతం విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చింది. జిల్లాలో మొత్తం 748 పాఠశాలలు ఉండగా, వాటి అవసరాల కోసం రూ.1,01,40,000 క్రీడావసరాల కోసం రూ.24,92,500 మంజూరు చేసింది. విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు కేటాయించింది. ప్రధానోపాధ్యాయులు బడుల నిర్వహణకు ఈ నిధులు వినియోగించాలని సూచించింది. ఈ నిధులు వెచ్చించి చాక్‌పీస్‌లు, స్టేషనరీ కొనుగోలు, బడిబాట నిర్వహణ, చిన్న మరమ్మతు తదితర అవసరాకు వినియోగించాలని సూచించింది. గత విద్యా సంవత్సరం విడుదలైన నిధులన్నీ ఖర్చయ్యాయి. కాగా, జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 492, ప్రాథమికోన్నత 82, ఉన్నత పాఠశాలలు 174 ఉన్నాయి.

వయోవృద్ధులకు 'ఆసరా'



జ్ఞాపిక అందిస్తున్న సీనియర్ సిటిజన్స్

జగిత్యాలజోన్: దేశంలో ఎక్కడా లేనివిధంగా వయోవృద్ధులకు ఆసరా ద్వారా అత్యధిక పింఛన్ చెల్లిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జెడ్పీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం సభ్యులు ఆమెను కలిశారు. జెడ్పీ చైర్ పర్సన్‌గా నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వసంతకు జ్ఞాపికత అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతోంతుందన్నారు. సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు ఎండీ యాకుబ్, కోశాధికారి ప్రకాశ్ పాలత్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఏబీవీపీ అగ్రస్థానం

జగిత్యాలటౌన్: విద్యార్థుల సమస్యల పరిష్కారంతోపాటు సమాజ సమస్యల పరిష్కారంలో తనదైన పాత్ర పోషిస్తున్న ఏబీవీపీ.. దేశంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్‌గా నిలిచిందని ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నల్‌దాస్ మురళి అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం, జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పాతబస్టాండ్ చౌరస్తాలో జెండా ఆవిష్కరించి మాట్లాఆరు. స్వామీ వివేకానంద స్ఫూర్తితో జ్ఞానం, శీలం, ఏకత ఆధారంగా పనిచేస్తోందన్నారు. అమృతోత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. నాయకులు రాపాక సాయికుమార్, రెంటం జగదీశ్, మల్లేశ్, మహేందర్, శ్రీను, మనోహర్, వినయ్, నందు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్



ఒడ్యాడ్‌లో దొంగలు ధ్వంసం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్(ఫైల్)

ఫిర్యాదు చేస్తున్నాం



జిల్లాలో కొంతకాలంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి కాపర్ వైరు, ఆయిల్ చోరీ చేస్తున్నారు. వీటిపై పోలీస్‌స్టేషన్లలో తరచూ ఫిర్యాదు చేస్తున్నాం. ఎస్పీ దృష్టికి కూడా తీసుకెళ్తున్నాం. చోరీల నియంత్రణకు విద్యుత్ సిబ్బంది, రైతులను అప్రమత్తం చేస్తున్నాం.

– సత్యనారాయణ, ట్రాన్స్‌కో జిల్లా అధికారి, జగిత్యాల

- మెట్‌పల్లి రూరల్ సెక్షన్ పరిధి వేంపేటలోని 25 కేవీ సామర్థ్యంగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈ ఏడాది మే 20న దొంగలు పగులగొట్టారు. అందులోంచి రాగి తీగ ఎత్తుకెళ్లారు. అధికారులు ఫిర్యాదు చేయగా.. 169/23 నంబరుపై ఎఫ్ఐఆర్ నమోదైంది.
- మేడిపల్లి(పడమర) సెక్షన్ పరిధి రాజేశ్వర్‌రావుపేటలోని 25 కేవీ సామర్థ్యంగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గత ఏప్రిల్ 19న దొంగలు ధ్వంసం చేశారు. అందులోంచి 200 లీటర్ల ఆయిల్ ఎత్తుకెళ్లగా.. అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- కాపర్ వైర్, ఆయిల్ చోరీ
- రెండున్నరేళ్లలో 132 దొంగతనాలు
- ట్రాన్స్‌కోకు రూ.1.50కోట్లు నష్టం
- విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం
- పంటలకు నీళ్లు అందక అన్నదాతల పాట్లు

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. వాటిని ధ్వంసం చేసి విలువైన కాపర్, ఆయిల్ ఎత్తుకెళ్తున్నారు. దీనిద్వారా ట్రాన్స్‌కోకు రూ.కోట్లలో నష్టం వాటిల్లుతుండగా.. రోజుల తరబడి విద్యుత్ సరఫరా నిలిచి వ్యవసాయ పంపుసెట్లు నడవక పంటలకు నీళ్లు అందడంలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రెండున్నరేళ్లలో 132 చోరీలు..

- జిల్లాలో గత రెండున్నరేళ్లలో 132 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేశారు.
- 2021లో 23 దొంగతనాలు, 2022లో 74 చోరీలు, 2023లో ఇప్పటివరకు 35 ట్రాన్స్‌ఫార్మర్లు దొంగల చేతిలో ధ్వంసమయ్యాయి.
- వీటిని ధ్వంసం చేస్తున్న దొంగలు.. విలువైన కాపర్, ఆయిల్ ఎత్తుకెళ్లారు.
- ప్రధానంగా నేరెళ్ల, కోరుట్లరూరల్, మెట్‌పల్లిరూరల్, మెట్‌పల్లిటౌన్, జగిత్యాలరూరల్ మండలం పొలాస, ఇబ్రహీంపట్నం, వెల్గటూర్, మేడిపల్లి తూర్పు, ధర్మపురి, రాఘవపేట, కథలాపూర్, మన్నెగూడెం, రామన్నపేట, బీర్‌పూర్ విద్యుత్ సెక్షన్ల పరిధిలో దొంగతనాలు అధికంగా జరుగుతున్నట్లు ట్రాన్స్‌కో, పోలీస్ అధికారులు గుర్తించారు.
- ఎక్కువగా మారుమూల గ్రామాలు, శివారు ప్రాంతాల్లోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్నారు.
- ఇక్కడ చోరీచేసిన కాపర్, ఆయిల్‌ను దొంగలు నిజామాబాద్, ఆదిలాబాద్‌తోపాటు మహారాష్ట్రకు సులభంగా తరలించే వీలుందని అధికారులు భావిస్తున్నారు.

టార్గెట్.. 16 కేవీ, 25కేవీ సామర్థ్యంగలవే..

వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ సరఫరా చేసేందుకు అధికంగా 16 కేవీ, 25 కేవీ సామర్థ్యంగల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై 3 నుంచి 4 వరకు విద్యుత్ మోటార్లు బిగించుకుంటారు. వీటిలో ఒక్కోదాని ధర సుమారు రూ.75 వేల వరకు ఉంది. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై 5 నుంచి 6 మోటార్లు బిగించుకునే అవకాశం ఉంది. దీనిధర రూ.లక్ష వరకు ఉంది. 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 24కిలో కాపర్, 60 లీటర్ల ఆయిల్ ఉంటుంది. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 32 కిలోల కాపర్ వైరు, 100 లీటర్ల ఆయిల్ ఉంటుంది. రాగితీగ కిలో ధర మార్కెట్‌లో రూ.1,500–రూ.2,000 వరకు ఉండగా, ఆయిల్ ధర రూ.120 వరకు పలుకుతోంది. దొంగలు ఎత్తుకెళ్లిన కాపర్ వైరును స్క్రాప్ దుకాణంలో విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

ట్రాన్స్‌కోకు నష్టం..

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కొందరు సభ్యులు గల ముఠా ధ్వంసం చేస్తోందని అధికారులు గుర్తించారు.
- జంపర్లు కట్ చేశాక ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు తీసి.. నట్, బోల్టులు తొలగించి, ఇంటర్ లింక్ కట్‌చేసి, కాపర్ వైరు, ఆయిల్ అపహరిస్తున్నారు.
- కరెంట్ ప్రక్రియ తెలిసిన, కరెంట్ కార్యాలయాల్లో పనిచేసే వారికే ఇలాంటి టెక్నిక్‌లు తెలిసి ఉంటాయని అంటున్నారు.
- అయితే, ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేసేందుకు సుమారు రూ.50 వేల వరకు ఖర్చు వస్తోంది.
- ఇది ట్రాన్స్‌కోకు ఆర్థిక భారంగా మారగా, పంటలకు నీళ్లు అందక రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయి.

ఈవీఎంల పనితీరుపై దృష్టి

- యంత్రాల తనిఖీలో అధికారులు బిజీ



కోరుట్ల: మరికొద్ది నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రక్రియలో కీలకమైన ఈవీఎంల పరిశీలనపై జిల్లా అధికారులు దృష్టి సారించారు. జిల్లాకు అవసరమైన ఈవీఎంలను ఎన్నికల కమిషన్ ఇప్పటికే సరఫరా చేసింది. జగిత్యాలలోని మినిస్టేడియంలో వీటిని భద్రపర్చారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి వాటి పనితీరు తనిఖీ చేస్తున్నారు. వారం, పది రోజులుగా ఈ ప్రక్రియ సాగుతోంది. ఈక్రమంలోనే ఈవీఎంల తొలిదశ పరిశీలించే కార్యక్రమం పూర్తిచేయనున్నట్లు సమాచారం.

జిల్లాకు 1,400 ఈవీఎంలు..

- ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పనులు సెప్టెంబర్ చివరి నాటికి తుదిదశకు చేరాలని ఎన్నికల కమిషన్ నిర్దేశించింది.
- ఈనేపథ్యంలో అక్టోబర్ 4వ తేదీన ఓటరు తుదిజాబితా ప్రకటించనున్నారు.
- ఈ క్రమంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు సరిచూసుకోవడం కీలకం.
- జిల్లాలోని జగిత్యాల అసెంబ్లీలో 254, కోరుట్లలో 262, ధర్మపురిలో 269 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- జిల్లా ఓటర్ల సంఖ్య ఆధారంగా 1,400 ఈవీఎంలను సిద్ధం చేస్తున్నారు.
- పోలింగ్ సమయంలో ఈవీఎంలు మొరాయించడం, ఓట్లు నమోదు కాకపోవడం వంటి సాంకేతిక సమస్యలు ఎదురైన సందర్భాల్లో వినియోగించేందుకు అదనంగా 600 ఈవీఎంలు అందుబాటులో ఉంచినట్లు తెలిసింది.

పది రోజులుగా..

ఈవీఎంల పనితీరు తెలుసుకునేందుకు జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో రెవెన్యూ అధికారులు వారం, పది రోజులుగా ఈవీఎంలను పరిశీలిస్తున్నారు. గతంలో ఎన్నికలు నిర్వహించిన అనుభవం ఉన్న ఆరుగురు తహసీల్దార్లు, 50 మంది రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణలో తనిఖీ చేస్తున్నారు. ప్రధానంగా బ్యాటరీలు, ఓటింగ్ మిషన్ల బటన్లు, బీప్ శబ్దం, ఓటు నమోదు తీరు, లైట్లు వెలుగులు తదితర అంశాలను సంపూర్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఒక్కో ఓటింగ్ మిషన్‌లో శాంపిల్‌గా సుమారు 50 వరకు ఓట్లు వేసి వాటి కౌంటింగ్ సరిచూస్తున్నారు. ఇలా ఓటింగ్ మిషన్ పూర్తిస్థాయిలో పనిచేసి సమస్యలు లేకుంటే వాటిని ఎన్నికల ప్రక్రియలో వినియోగించేందుకు సిద్ధం చేస్తున్నారు. రెండోదశలో ఈవీఎంల పరిశీలన పార్టీలు, గుర్తులు వచ్చిన తర్వాత చేపడతారని సమాచారం.

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

అసెంబ్లీస్థానం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
జగిత్యాల	254	2,13,287
కోరుట్ల	262	2,23,867
ధర్మపురి	269	2,10,896

అభివృద్ధికి పట్టం

- మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

బుగ్గారం(ధర్మపురి): గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం రూ.కోట్లు కేటాయిస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో రూ.62లక్షల వ్యయంతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, బస్‌షెల్టర్, యాదవ సంఘం భవన నిర్మాణాలకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. గోపులాపూర్ గ్రామానికి చెందిన పద్మశాలి, మాల సంఘం భవన నిర్మాణాలకు ప్రొసీడింగులు అందజేశారు. యశ్వంతరావ్‌పేటలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ, రూ.30 లక్షలు, శెకల్లలో రూ.20 లక్షలు వెచ్చించి చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడారు. గత పాలకులు బుగ్గారంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఏమీ లేవని, వీటిని ప్రజలే గుర్తించాలన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్నిరకాల సదుపాయాలు కల్పించామని తెలిపారు. కుల, వర్గ విభేదాలు లేకుండా అందరికీ ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. అన్ని సామాజిక వర్గాల సంక్షేమానికి బాటలు వేస్తోందని అన్నారు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని నమ్మవద్దని, బుగ్గారం మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని మంత్రి చెప్పారు. ఇప్పటికే ఎంతోప్రగతి సాధించామని, రానున్న రోజుల్లో బుగ్గారం రూపురేఖలు మారుతాయని స్పష్టం చేశారు. అనంతరం ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఆకర్షితులైన యాదవులు పెద్దఎత్తున బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంత్రి పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు బాదినేని రాజమణి, రాజేందర్, సర్పంచులు మూల సుమలత, కోల రాజు, వైస్ ఎంపీపీ సుచేందర్, నాయకులు గాలిపెల్లి మహేశ్, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని ప్రోత్సహిస్తున్నారా?

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం అంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే అని వరంగల్ సభలో స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపించారని, ఇలాంటి ఆధారాలు ఉన్నా.. కేసీఆర్ ప్రభుత్వంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక ఇందిరాభవన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోకపోవడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతా రాహిత్యం, లోపాయకారి ఒప్పందానికి నిదర్శనం కాదా? అని నిలదీశారు. అనంతరం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన 50 మంది యువకులు ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, బండ శంకర్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు గాజంగి నందయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న జీవన్‌రెడ్డి

రహదారుల నిర్మాణానికి నిధులు

జగిత్యాలరూరల్: రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. పోరండ్ల ఎస్సీ కాలనీలోని సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు కాగా మంజూరు పత్రాన్ని అందజేశారు. సర్పంచ్ పోగ్గుల సంధ్యారాణి, నాయకులు గాజంగి నందయ్య, నరేశ్, గణేశ్, కోటేశ్ పాల్గొన్నారు.

దిగుబడి పెంపు ధ్యేయం

- వందశాతం రాయితీపై కంది విత్తనాలు
- ఉచితంగా పంపిణీ చేస్తున్న అధికారులు
- జిల్లాలో సాగు విస్తీర్ణం 670 ఎకరాలు
- వ్యవసాయాధికారుల ప్రణాళిక




కంది విత్తనాలు అందిస్తున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): పప్పు దినుసుల సాగు విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రైతులు ఈ పంటను పండించేలా వారిని ప్రోత్సహించాలని నిర్ణయించింది. దీంతో జిల్లా వ్యవసాయాధికారులు జాతీయ ఆహారభద్రత పథకం కింద రైతులకు ఉచితంగా కంది విత్తనాలు అందిస్తున్నారు. కంది పంటను సాగుచేయాలని క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. వాణిజ్య పంటలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్న నేపథ్యంలో వీటి ఉత్పత్తిని పెంచాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

670 ఎకరాలకు ఉచితంగా..

- జిల్లాలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, పసుపు, పత్తి, ఆయిల్‌పామ్ తదితర పంటలు సాగు చేస్తున్నారు.
- మొక్కజొన్న సాగుచేసే రైతులు అంతర పంటగా కంది పంట సాగు చేస్తారు.
- మరోవైపు.. ఈ పంటకు నీటి అవసరం చాలా తక్కువ.
- పప్పు దినుసుల పంటల సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం జిల్లాలోని రైతులకు వందశాతం(ఉచితంగా) సబ్సిడీపై కంది విత్తనాలు అందిస్తోంది.
- 4 కిలోల విత్తనాలను ఒక సంచిగా తయారు చేసి ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలకు సరఫరా చేసింది.
- జిల్లాకు 1,175 విత్తనాల సంచులు సరఫరా అయినట్లు అధికారులు తెలిపారు.
- కంది సాగుచేసే రైతులు తమ పట్టదారు పాస్‌బుక్కు, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలు తీసుకొని అధికారుల వద్దకు వెళ్లి ఉచితంగా విత్తనాలు తీసుకెళ్తున్నారు.
- జిల్లాలో సుమారు 670 ఎకరాల్లో కంది పంటను సాగు చేయించాలనే లక్ష్యంతో విత్తనాలు అందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు వివరించారు.


ఆనందంగా ఉంది



రోజురోజుకూ విత్తనాలు, ఎరువుల ధరలు పెరుగుతున్నాయి. రైతులపై ఆర్థికభారం పడుతోంది. ఈ క్రమంలో కంది పంట సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందించడం ఆనందంగా ఉంది. మొక్కజొన్న పంటలో కందులను అంతర పంటగా సాగు చేయాలనుకుంటున్నా. రెండు ఎకరాల్లో ఈ పంటను సాగు చేయాలని నేలను దున్నించా.


– పుర్కుటపు నర్సారెడ్డి, రైతు, భూషణరావుపేట

జూన్‌లో అందిస్తే బాగుండు



మే నెల చివరి వారం, జూన్ మొదటి వారంలోనే మేం భూములను దున్నించినం. జూన్ రెండోవారంలోనే మొక్కజొన్న, పత్తి, కంది పంట వేసినం. వందశాతం సబ్సిడీపై అందించే కంది విత్తనాలు జూన్ మొదటి వారంలో రైతులకు పంపిణీ చేస్తే బాగుండేది. ఎక్కువమంది కంది పంటను సాగుచేసేవారు. ఈ పంట చేతికొచ్చాక రైతులు విక్రయించేందుకు వీలుగా మండలానికో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.– పూండ్ర మీన్‌రెడ్డి, రైతు, దూలూర్

దిగుబడి పెంపు లక్ష్యం



కందిపప్పు దిగుబడి పెంచేందుకు రైతులకు విత్తనాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. సాగుచేసే రైతులే విత్తనాలు తీసుకొని సహకరించాలి. గ్రామాల్లోని రైతు సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు కంది సాగును ప్రోత్సహిస్తే బాగుంటుంది. వందశాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నాం. వర్షాలు సమృద్ధిగా కురిశాక విత్తనాలు వేస్తే పంట ఎదిగి దిగుబడి అధికంగా వస్తుంది.

– దండ రమేశ్, ఏడీఏ, మెట్‌పల్లి

పడిపోతున్న భూగర్భజలాలు

- జూన్‌లో 5.97 మీటర్లకు పడిపోయిన జలాలు
- ఒక్కనెలలోనే 0.46 మీటర్లు తగ్గుదల
- చెరువులు, కుంటల్లోకి చేరని నీరు
- సాగుకు ఆలస్యమవుతుండటంతో రైతుల్లో ఆందోళన


అడుగంటిన మంచినీటి బావి

జగిత్యాల అగ్రికల్చర్ : జిల్లాలో భూగర్భజలాలు పడిపోతున్నాయి. ఓవైపు సాగు, మరోవైపు రోజువారీ అవసరాలకు నీటి వినియోగం ఎక్కువ కావడంతో, నీటి మట్టం రోజురోజుకు పడిపోతోంది. జూన్‌లోనే నీటిమట్టం 0.46 మీటర్లు పడిపోయాయి. పంటల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో చెరువులు, కుంటలు, బావుల్లోకి నీరు చేరకపోవడంతో వరినాట్లు వేసేందుకు ఆలస్యం అవుతుందని ఆందోళన చెందుతున్నారు.

మున్సిపాలిటీల్లో ఆందోళన

జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో జనాభా ఎక్కువ. దీంతో, ఈ పట్టణ ప్రాంతాల్లో నీటి వినియోగం రోజురోజుకూ పెరిగిపోయి, భూగర్భజలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇంటింటా బోరుబావులు ఉండటంతో, ఇష్టం వచ్చినట్లు నీటిని వినియోగిస్తున్నారు. జిల్లా కేంద్రంలో మే నెలలో 8.09 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా, నీటిమట్టం 0.47 మీటర్లకు పడిపోయి, ప్రస్తుతం 8.56 మీటర్లకు చేరుకుంది. కోరుట్ల పట్టణంలో భూగర్భ నీటిమట్టం 0.47 మీటర్లు పడిపోయి, 10.80 మీటర్లకు చేరింది. మెట్‌పల్లిలో గతనెలలో 4.06 మీటర్ల లోతులో భూగర్భజలం ఉండగా, జూన్ చివరి నాటికి 0.65 మీటర్లు పడిపోయి 4.71 మీటర్లకు చేరుకుంది. రాయికల్ మున్సిపాలిటీలో మే నెలలో 2.89 మీటర్ల లోతులో భూగర్భ జలాలుండగా, జూన్ చివరి నాటికి 0.98 మీటర్లకు పడిపోయి, ప్రస్తుతం 3.87 మీటర్లకు చేరుకుంది. ధర్మపురిలో గతనెలలో 7.79 మీటర్ల లోతులో భూగర్భజలం ఉండగా, ప్రస్తుతం 0.51 మీటర్లు పెరిగి, 8.30 మీటర్లకు చేరుకుంది.

నాన్ – ఆయకట్టు ప్రాంతాల్లో అంతంతే..

జిల్లాలో నాన్ – ఆయకట్టు ప్రాంతాలుగా ముద్రపడ్డ (సాగు నీరు అందని) మల్యాల, మేడిపల్లి, కథలాపూర్, కొడిమ్యాల, మెట్‌పల్లి ప్రాంతాల్లో భూగర్భ జలాలు మరింతగా పడిపోతున్నాయి. మల్యాల మండలంలో గతనెలలో 6.67 మీటర్ల లోతులో నీరు ఉండగా, నీటి మట్టం 0.52 మీటర్లు పడిపోయి, ప్రస్తుతం జూన్ చివరి నాటికి 7.19 మీటర్లకు చేరుకుంది. కొడిమ్యాలలో మే నెలలో 8.45 మీటర్లు ఉండగా 0.19 మీటర్లు పెరిగి, ప్రస్తుతం 8.26 మీటర్లకు చేరుకుంది. కథలాపూర్ 3.10 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం, ప్రస్తుతం 0.37 మీటర్లకు పడిపోయి 3.47 మీటర్లకు చేరుకుంది. మేడిపల్లి మండలంలో 3.90 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం 0.05 మీటర్లు పెరిగి, ప్రస్తుతం 3.95 మీటర్లకు చేరుకుంది.

ఒక్కనెలలోనే పడిపోయిన నీటిమట్టం

జిల్లాలో ఒక్క నెలలోనే నీటిమట్టం సగటున 0.46 మీటర్లకు పడిపోయింది. మే నెలలో 5.51 మీటర్ల లోతులో నీరుండగా, జూన్ నెల చివరి నాటికి 0.46 మీటర్లు పడిపోయి, ప్రస్తుతం 5.97 మీటర్లకు చేరుకుంది. జిల్లాలో జూన్‌చివరి నాటికి బీర్‌పూర్ మండలంలోనే అతి తక్కువ 3.09 మీటర్ల లోతులో నీరుండగా, అత్యధికంగా 10.80 మీటర్ల లోతులో కోరుట్ల మండలంలో నీరుండటం గమనార్హం.

వర్షాలు పడకపోతే మరింత లోతుకు జలాలు



వర్షాలు పడకపోతే నీటి మట్టం మరింత పడిపోయే అవకాశం ఉంది. మే నెలలో కొద్దిపాటి వర్షాలు కురవడంతో కొన్ని మండలాల్లో అంతంతమాత్రంగా భూగర్భజలాలు ఉన్నాయి. నాన్ ఆయకట్టు ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో భూగర్భజల మట్టం పడిపోతోంది. పొదుపుగా నీటిని వాడాల్సిన అవసరం ఉంది.

– నర్సింహులు, జిల్లా భూగర్భ జల వనరుల శాఖాధికారి, జగిత్యాల

మండలాల వారీగా భూగర్భజల నీటి మట్టం (మీటర్లలో...)

మండలం	మే నెలలో	జూన్ నెలలో
బీర్‌పూర్	2.47	3.09
ధర్మపురి	7.79	8.30
గొల్లపల్లి	5.02	5.84
జగిత్యాల రూరల్	3.33	4.08
జగిత్యాల అర్బన్	8.09	8.56
పెగడపల్లి	4.04	5.16
రాయికల్	2.89	3.87
సారంగాపూర్	6.57	6.79
వెల్గటూర్	3.47	4.06
కొడిమ్యాల	8.45	8.26
మల్యాల	6.67	7.19
ఇబ్రహీంపట్నం	4.15	4.57
కోరుట్ల	10.33	10.80
మల్లాపూర్	8.08	8.27
కథలాపూర్	3.10	3.47
మేడిపల్లి	3.90	3.85
మెట్‌పల్లి	4.06	4.71

క్లుప్తంగా

'అడెల్లి'లో కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పూజలు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు

సారంగపూర్: నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే ను సత్కరించారు. అమ్మవారికి ఆషాఢ బో నా లు సమర్పించిన ప్యారమూర్ గ్రామానికి చెందిన శివసత్తుల బృందం సభ్యులను సన్మానించారు. ఆలయ ఈవో రవికిషన్, సీనియర్ అ సిస్టెంట్ రమణారావు, ప్రధాన అర్చకుడు శ్రీ ని వాసశర్మ, ఆలయ కమిటీ సభ్యురాలు దేవాయి ఉన్నారు.

పంపుహౌస్‌ల సందర్శన


రాజేశ్వర్‌రావుపేట పంపుహౌస్ వద్ద రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రైతులు ఆదివారం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రాంపూర్ పంపుహౌస్, రాజేశ్వర్‌రావుపేట పంపు హౌస్‌ను సందర్శించారు. కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీకి నీటిని ఎత్తిపోసే విధానం గురించి అధికారులు వారికి వివరించారు. అనంతరం, రైతులు ఎస్సారెస్పీని సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిని పరిశీలించారు. సర్పంచ్ చెరుకు జాన్, రైతు సంఘం నాయకులు ఎడమల సత్యం, పూదరి జనార్దన్, ఏనుగు లక్ష్మారెడ్డి, గర్వందుల గంగయ్య, తీపిరెడ్డి రత్నాకర్, ఏలేటి రాజిరెడ్డి, పురుపటి రాజిరెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్): అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్‌ఐ చంద్రారెడ్డి వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన బాపు ప్రశాంత్(25) చిన్నతనం నుంచి మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నా తగ్గడం లేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ప్రశాంత్ ఆదివారం ఇంటో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసున్నాడు. మృతుని తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జమ్మికుంట(హుజూరాబాద్): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన జమ్మికుంట మండలంలో జరిగింది. ఎస్‌ఐ యూనిస్‌అహ్మద్‌అలీ వివరాల ప్రకారం.. మండలంలోని వావిలాల గ్రామపంచాయతీ పరిధి గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన కంకణాల శ్రీనివాస్‌రెడ్డి గత నెల 29న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లాడు. ఈ నెల 8న రాత్రి ఇంటికి చేరుకున్న క్రమంలో తాళం పగులగొట్టి ఉండడాన్ని గుర్తించాడు. ఇంట్లోని 4 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ.15వేలు చోరీకి గురైనట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జగిత్యాలలో అదృశ్యం.. కరీంనగర్‌లో ప్రత్యక్షం

- నాలుగు గంటల తర్వాత ఆచూకీ లభ్యం
- కిడ్నాప్ చేశారంటున్న బాలుడు
- బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు


బాలుడిని విచారిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: అదృశ్యమైన బాలుడు నాలుగు గంటల తర్వాత ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాలలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల సంజీవరావు కుమార్తె అనురాధకు పదమూడేళ్ల క్రితం కరీంనగర్‌కు చెందిన వెంకటేశ్వర్‌రావుతో వివాహమైంది. వీరికి కుమారుడు ఫణిరేవంత్‌రావు (12) ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో పదకొండేళ్లుగా తల్లీ కుమారుడు విద్యానగర్‌లోని సంజీవరావు ఇంట్లో ఉంటున్నారు. ఆదివారం ఉదయం ఫణిరేవంత్‌రావు ఇంటి సమీపంలోని రామాలయానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో అనురాధ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా హైదరబాద్‌లో ఉన్న బంధువు కరీంనగర్ టూటౌన్‌లో పోలీసులు వద్ద ఫణిరేవంతరావు ఉన్నట్లు సమాచారం అందించాడు. దీంతో అనురాధ, తాత సంజీవరావు కరీంనగర్ వెళ్లి బాలుడిని జగిత్యాలకు తీసుకువచ్చారు. దీనిపై బాలుడిని పోలీసులు విచారించగా తనను గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు కిడ్నాప్ చేసి కరీంనగర్ తీసుకెళ్లారని, బస్టాండ్ వద్ద అనుమానాస్పందంగా కనిపించగా తనను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని పొంతన లేని సమాధానం చెప్పాడు. బాలుడిని ఇటీవలే రాయికల్ మండలం అల్లీపూర్ ప్రభుత్వ వసతి గృహంలో చదువు నిమిత్తం చేర్పించారు. వసతి గృహంలో ఉండడం ఇష్టంలేక పారిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. తల్లి మాత్రం తన కుమారుడిని కిడ్నాప్‌చేసి ఉంటారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని పట్టణ పోలీసులకు తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


సంఘటన స్థలంలో క్షతగాత్రులు

మల్యాల: మండలంలోని నూకపల్లి గ్రామ శివారులో జగిత్యాల, కరీంనగర్ ప్రధాన రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. మండలకేంద్రానికి చెందిన ముకుందు అనిల్, వీరసాగర ప్రసాద్ జగిత్యాల నుంచి మల్యాలకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా నూకపల్లి వరదకాలువ వంతెనపై వీరి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు 108 వాహనంలో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

ఒకరిపై అదనపు కట్నం కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యూనిస్‌అహ్మద్‌అలీ ఆదివారం తెలిపారు. జమ్మికుంట పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో నివాసముంటున్న తోర్నే వనిత, సంతోష్ దంపతులకు 22 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నా రు. కొంతకాలంగా సంతోష్ అదనపు కట్నం రూ.10లక్షలు తీసుకురావాలని వనితను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. బాధితురా లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుడుంబా విక్రయిస్తున్న మహిళపై కేసు

సారంగాపూర్: మండలంలోని రంగపేటలో గుడుంబా విక్రయిస్తున్న మహిళపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ మహిళ గుడుంబాను నిల్వఉంచి విక్రయిస్తుండగా పట్టుకున్నామని, రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి


సంజన మృతదేహం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చిలుకవాడ ప్రాంతానికి చెందిన సుద్దాల సంజన (11) ఆదివారం ఉదయం అనుమానాస్పదంగా మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. బాలిక తల్లి రాధ పనినిమిత్తం బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి సంజన మంచంపై పడిపోయి ఉంది. వెంటనే తల్లి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. సంజన మెడపై ఉరేసుకున్నట్లు గాయాలుండటంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా తల్లి రాధ మాత్రం ఫిట్స్‌తోనే మృతిచెందినట్లు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. కాగా మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

పాముకాటుతో బాలుడి మృతి


లవణ్‌కుమార్ మృతదేహం

సారంగాపూర్: పాముకాటుతో బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పోతారం శివారు గ్రామం గనెగుట్ట నాయికపుగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నాయికపుగూడెంకు చెందిన భీమయ్య – లక్ష్మి దంపతుల కుమారుడు బద్ది లవణ్‌కుమార్ (10) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో ఇంటివద్ద పిలలతో ఆడుకుంటుండగా పాముకాటు వేసింది. చికిత్స నిమిత్తం వెంటనే కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యంలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాదంలో పశువుల కొట్టం దగ్ధం

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లిలో ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో పశువుల కొట్టం దగ్ధమైనట్లు ఆదివారం గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని మేడిపెల్లి సాయిరెడ్డి అనే రైతుకు చెందిన పశువుల కొట్టంలో నిప్పంటుకొని మంటలు చెలరేగగా ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలానార్పారు. పశువుల కొట్టంతోపాటు అందులోని వ్యవసాయ పరికరాలు, పశుగ్రాసం కాలిపోయింది. సుమారు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రాయికల్: మండలంలోని సింగరావుపేట గ్రామ శివారులో ఆది వారం ఏడుగురు పేకాటరా యుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై అజ యకుమార్ తెలిపారు. పేకాడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్సై ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా ఏడుగురిని అరెస్ట్ చేయగా వీరివద్ద నుంచి రూ. 7,280 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు

వెల్గటూర్: ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళకు తీవ్రగాయాలైన సంఘటన వెల్గటూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గొల్లపల్లి మండలం మద్దునూర్‌కు చెందిన గొల్లపల్లి లక్ష్మి తన కూతురును చూసేందుకు వెల్గటూర్‌కు వచ్చింది. తిరిగి లక్ష్మిని అల్లుడు సంకోజు నరేశ్ ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా అంబేద్కర్ చౌరస్తా వద్ద కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని 108లో చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

వివాహితను కాపాడిన బ్లూకోల్ట్స్ పోలీసులు


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్ పోలీసులు

మల్యాల: కుటుంబ కలహాలతో వరదకాలువలో దూకి ఆత్మహత్యా యత్నానికి యత్నించిన వివాహితను బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన మల్యాల పద్మ కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఆదివారం గ్రామ శివారులోని వరద కాలువ కాలువలో దూకేందుకు యత్నించగా బ్లూకోల్ట్స్ పోలీసులు సత్యనారాయణ, సంపత్ గమనించి అడ్డుకున్నారు. దీంతో ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి భర్తను పిలిపించారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపించారు.

విద్యావలంటీర్లు రెన్యూవల్ అయ్యేనా?

- మూడేళ్లుగా విధుల్లోకి తీసుకోని సర్కారు
- ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య
- టీచర్ల కొరతతో నష్టం జరిగే అవకాశం
- జిల్లాలో 195 మంది విద్యావలంటీర్లు



జిల్లా సమాచారం

ప్రభుత్వ పాఠశాలలు	: 783
మంజూరైన టీచర్ పోస్టులు	: 3,915
ప్రస్తుతం పని చేస్తున్నవారు	: 3,294
ఖాళీగా ఉన్న పోస్టులు	: 621

మల్లాపూర్(కోరుట్ల): ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో ప్రభుత్వం ఏటా విద్యావలంటీర్లను నియమించేది. ఇందుకుగాను వారికి గౌరవ వేతనం చెల్లించేది. దీనివల్ల విద్యార్థులు తరగతులు నష్టపోకుండా ఉండటంతోపాటు వలంటీర్లకు సైతం ఉపాధి లభించేది. కరోనా నేపథ్యంలో బడులు మూతపడగా, అప్పటినుంచి వీరిని విధుల్లోకి తీసుకోవడం లేదు. మూడేళ్లుగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి ఎక్కువగా ఉన్నచోటుకు టీచర్లను డిప్యుటేషన్‌పై సర్దుబాటు చేశారు. ఈసారి కూడా సర్దుబాటు చేస్తారా? లేదా వీవీలను విధుల్లోకి తీసుకుంటారా వేచిచూడాలి.

'బడిబాట'తో పెరిగిన విద్యార్థుల సంఖ్య

ఈ ఏడాది సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్న ఉద్దేశంతో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఫలితంగా పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగింది. సరిపడా టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోయే అవకాశముంది. జిల్లాలో ప్రస్తుతం 621 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వాటిస్థానంలో విద్యావలంటీర్లను నియమించి, పిల్లలు నష్టపోకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఏటా ఎదురుచూపు..

ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా టీచర్ల ఉద్యోగ విరమణ, లాంగ్‌లీవ్, ఇతర కారణాల రీత్యా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఏర్పడుతూనే ఉంటాయి. టీచర్లు లేని పాఠశాలలు కూడా ఉన్నాయి. ఈ మేరకు జిల్లాలోని ఖాళీస్థానాల్లో 195 మంది విద్యా వలంటీర్లను నియమించి, విద్యార్థులు తరగతులు నష్టపోకుండా చూస్తున్నారు. అయితే ఏటా విద్యాసంవత్సరం పూర్తికాగానే మళ్లీ నూతన నోటిఫికేషన్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉన్నాయని వీవీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రెగ్యులర్ ఉపాధ్యాయులతో ఖాళీలు భర్తీ చేసేవరకు తమనే కొనసాగించాలని వారు కోరుతున్నారు.

వీవీలను కొనసాగించాలి



కోర్టు తీర్పుతో ప్రభుత్వం 2019–20 విద్యా సంవత్సరానికి గాను వీవీలను విధుల్లోకి తీసుకుంది. కానీ తర్వాత తీసుకోవడం లేదు. రెగ్యులర్ ఉపాధ్యాయులను భర్తీ చేసేవరకు మమ్మల్ని కొనసాగించాలి.

– శ్రీపెరంబదూర్ శశికళ, వీవీ, వాల్గొండ

విధుల్లోకి తీసుకోవాలి..



తక్కువ వేతనమైనా రెగ్యులర్ టీచర్లతో సమానంగా విధులు నిర్వహించాం. కరోనా తర్వాత కొనసాగించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఈసారైనా వీవీలను రెనివల్ చేయాలి.

– నిగ రాజేశ్, వీవీ, వీవీరావుపేట

ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు



ప్రభుత్వ పాఠశాలల్లో వీవీల కొనసాగింపునకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు. గతేడాది ఖాళీస్థానాల్లో టీచర్లను సర్దుబాటు చేశాం. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

– జగన్మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి

కొనసాగుతున్న ఆపరేషన్ ముస్కాన్

- జిల్లాలో ఆరుగురు బాల కార్మికులకు విముక్తి
- బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై కొరఢా
- ఈనెల 31వరకు కొనసాగనున్న కార్యక్రమం


తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

జగిత్యాలక్రైం: పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన వయస్సులో పనిలో మగ్గిపోతున్న బాలలకు విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ తొమ్మిదో విడత కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. బడి బయట ఉన్న ఆరుగురు చిన్నారులను గుర్తించిన అధికారులు వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్పించారు. కొంతమంది చిన్నారులు తల్లిదండ్రుల మాట వినకుండా పాఠశాలకు వెళ్లకుండా పనిచేస్తున్న బాల కార్మికులకు అధికారులు విముక్తి కల్పించారు. జిల్లాలో ఈనెల 31 వరకు కార్యక్రమం కొనసాగనుండగా ఇందుకు ఆపరేషన్ ముస్కాన్–9 బృందాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా రెండు టీంలను అప్పటి ఎస్పీ సింధూశర్మ ఏర్పాటు చేశారు. ఒక సబ్ డివిజన్ పరిధిలో ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక్క మహిళా కానిస్టేబుల్ ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేశారు. వీరు ప్రతి రోజూ జిల్లాలోని ఇటుక బట్టీలు, హోటళ్లు, దాబాలు, దుకాణాలు, బేకరీల్లో పనిచేస్తున్న వారిని గుర్తించనున్నారు. ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్, జనవరిలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బాల కార్మికులుగా ఉన్న వారిని గుర్తించి, బడిబాట పట్టిస్తోంది.

జిల్లాలో రెండు బృందాలు

ఆపరేషన్ ముస్కాన్-9 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని రెండు సబ్ డివిజన్లలో రెండు బృందాలను ఏర్పాటు చేశారు. జగిత్యాల సబ్ డివిజన్ పరిధిలో పట్టణ ఎస్సై పురుషోత్తం ఆధ్వర్యంలో ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్‌తో, మెట్‌పల్లి సబ్ డివిజన్‌లో మేడిపల్లి ఎస్సై చిరంజీవి, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్‌తో బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. దీంతో పాటు ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తే 1098, లేదా డయల్ 100కు కాల్‌చేసి పోలీసులకు సమాచారం అందిస్తే సమాచారం ఇచ్చిన వారిని గోప్యంగా ఉంచనున్నారు.

ఆపరేషన్ స్మైల్ వివరాలు

సంవత్సరం	బాలురు	బాలికలు	మొత్తం
2019	41	3	44
2020	56	2	58
2021	62	8	70
2022	7	5	12
2023	13	5	18

ఆపరేషన్ ముస్కాన్ వివరాలు

సంవత్సరం	బాలురు	బాలికలు	మొత్తం
2019	90	4	94
2020	0	0	0
2021	48	1	49
2022	34	1	35

చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు



జిల్లాలో బడీడు పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఈనెల 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ –9 కార్యక్రమం కొనసాగుతుంది. ఇప్పటి వరకు జిల్లాలో ఆరుగురు బాల కార్మికులకు విముక్తి కల్పించాం. వారిని పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేశాం.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

గల్ఫ్‌లో వలసజీవి బలవన్మరణం


అనిల్‌కుమార్ (ఫైల్)

మల్లాపూర్ : గల్ఫ్‌లో ఉరేసుకొని మండలంలోని కొత్తదాంరాజుపల్లికి చెందిన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని అనిల్‌కుమార్ (34)కు ఒబులాపూర్ గ్రామానికి చెందిన సునీతతో పదమూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమార్తె ఉంది. పదకొండేళ్ల క్రితం అనిల్‌కుమార్ ఉపాధికోసం బెహ్రాయిన్‌కు వెళ్లగా అక్కడ ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. కాగా అంతకుముందు ఉన్న అప్పులతో పాటు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఈనెల 7న ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడి భారతీయుల ద్వారా అనిల్‌కుమార్ మృతివిషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.